

# తానొకటి తలిస్తే

'సాయి'

"ఒరే రామూ"

..................

"ఒరేయ్ రాముడూ......"

..................

"రా......ము......డూ......"

గాఢనిద్రలో ఉన్న రామారావు ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా ఉన్న గోడ—గడియారం పన్నెండుంబావు చూపిస్తోంది.

కళ్లు నులుపుకుంటూ, "ఏవిటి బాబాయి" అన్నాడు. మాటల్లో నిర్లక్ష్యమూ, విసుగూ ప్రతి ధ్వనిస్తున్నాయి.

"కాసిని మంచినీళ్లు ఇవ్వరా......ప్రాణం పొయ్యే టట్లుంది......" అన్నాడు మూలుగుతూ రాఘవయ్యగారు.

"మంచినీళ్ళు......నీ బొందనీళ్ళు......ఆ వెధవ ప్రాణం పోయినా బాగుణ్ను" అని లోపలే అనుకొని, "ఆ, తెస్తున్నా......" అని లోపలికి పోయి, మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు.

అప్పటికి నెలరోజుల్నించి రాఘవయ్యగారు గుండె జబ్బుతో బాధపడుతున్నారు. వయస్సు తక్కువేమికాదు. డెబ్భయి దాటినయ్. అయినా, మనిషి దృఢంగా, పొట్టిగా పొన్నకాయలాగా ఉంటారు.

రామారావు రాఘవయ్యగారి అన్నకొడుకు. తల్లీ తండ్రీ చిన్నప్పుడే చనిపోతే, తనకూ నా అన్నవాళ్ళు లేకపోవడంవల్ల రాఘవయ్యగారే తనింటికి తెచ్చి పెంచి, పెద్దవాణ్ణి చేశారు. ఎమ్మేదాకా చదువు చెప్పించారు. తన తదనంతరం తన యావదాస్తి రామారావుకు చెందేటట్లు వీలునామా వ్రాశారు.

తెల్లవారింది.....

ఉదయం ఎనిమిదింటికల్లా డాక్టరు వచ్చాడు యథాప్రకారంగా.

పరీక్షా అవీ కానిచ్చి బయటకొచ్చిన తర్వాత

—4వ పేజీ చూడండి

# తానొకటి తలిస్తే

24-వ పేజీ తరువాయి

"ఎట్లా ఉందంటారు బాబాయికి" అనడిగాడు రామారావు డాక్టర్ని.

"గుండెజబ్బుకదామరి...! ఏ విషయమూ చెప్పటం కష్టం. కాని, మనిషి దేహ పటుత్వాన్నిబట్టిచూస్తే, పదేళ్ళవరకు ఆయనకు ఏ చలనమూ లేదు......అదీ సంగతి......మరి నే వస్తా......"

"దేనికి అఘోరించను......పదేళ్ళదాక ఏ చలనం లేదుట. అవునులే ...... నన్ను విసిగించకుండా ఆ జీవుడు ఎందుకు లేస్తాడు ఆ బొందిలోంచి....." అని లోపల్లోపలే పణుక్కున్నాడు రామారావు.

"ఒరేయ్ రామూ......"

"ఏం భీమూ......" అని మెల్లగా తనలో తనే అనుకొని, "ఆఁ...వస్తున్నా బాబాయి..." అంటూ లోపలికి నడిచాడు.

"రా......ఇలా వచ్చి ఈ మంచంమీద కూర్చో. నీతో ఎన్నాళ్ళబట్టో ఒక ముఖ్యమయిన విషయం చెబుదామనుకుంటున్నాను......దానికి సమయం ఇప్పుడు వచ్చింది.....ఆఁ ఏంలేదు.....నే నింక ఎక్కువ రోజులు బ్రతకను. నా చావు ఘంటల్లో ఉంది....ఏదీ...ఆ ఫ్లాస్కులోని కాసిని కాఫీ ఇలా ఇవ్వు....."

కాఫీ పోసి ఇచ్చాడు రామారావు. త్రాగి మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు రాఘవయ్యగారు.

"ఇప్పుడు నేను చెప్పబోయ్యేది మన కుటుంబానికి చెందిన ఒక ముఖ్యమైన విషయం. ఇది ఎవ్వరితో చెప్పకూడదు సుమా......! మన వంశంలోని వాళ్ళకు మృత్యువు అందరికి వచ్చేలాంటి సామాన్య మృత్యువుకాదు. మరణ ఘడియలముందు "నల్లపిల్లి" కనపడితేకాని, ప్రాణాలు పోవు. అది ఒక ఆచారమై పోయింది. నేను ఆ నల్లపిల్లికోసమే ఎదురు చూస్తూ ఈ ప్రాణాలని ఇలా పట్టిఉంచాను. ఎందుకో నాకు అనుమానంగా ఉంది. ఆ నల్లపిల్లి ఇవ్వాళో, రేపో కనబడ్తుందని.....కనుక నీకు మన వంశంలోనివాళ్ళ మరణ రహస్యం చెబుతున్నాను....."

రామారావు జాగ్రత్తగా వింటున్నాడు.

మళ్ళీ రాఘవయ్యగారు చెప్పటం మొదలుబెట్టారు.

"మానాన్న చనిపోయేముందుకూడా అలాగే జరిగింది. ఆయన ఇంకొక నిముషంలో చనిపోతారనగా, ఒక నల్లపిల్లి 'మ్యావు', 'మ్యావు' మంటూ, కిటికీలోంచిదూకి మంచం క్రిందగా పోయింది. వెంటనే మా నాన్న చనిపొయ్యాడు. మొన్న మొన్న మీ నాన్న పోయేముందు కూడా అలాగే జరిగింది....." అంటూ నిట్టూర్చాడు రాఘవయ్యగారు.

"అలా భయపడకు బాబాయి" అంతకుమించి ఏం మాట్లాడాలో తెలియలేదు రామారావుకు.

"ఇదిగో రాముడూ! ఇది మన జీవిత రహస్యం. భద్రం సుమా....." అని ఆయాసంతో ప్రక్కకు తిరిగి పడుకున్నాడు రాఘవయ్యగారు.

రామారావు ఏదో ఆలోచించుకుంటూ బయటకు నడిచాడు.

రాత్రి ఎనిమిదయింది.....

రాఘవయ్యగారు నిద్ర—మాత్రలు మింగి, పాలు త్రాగుదామని లేచి కూర్చున్నారు......

ఎదురుగాఉన్న కిటికీలో ఒక నల్లపిల్లి నుల్చొని "మ్యావు", "మ్యావు" అంటూంది.....!

"ఒ.....రే.....యి.....రా.....ము.....డూ......" అని ఒక గావుకేక పెట్టాడు రాఘవయ్యగారు.

పక్కగదిలోఉన్న రామారావు "ఏం జరిగింది బాబాయి......" అంటూ గబగబా వచ్చి ఆ దృశ్యం చూసి, అదిరిపోయినాడు.

రాఘవయ్యగారు గది దద్దరిల్లేలా పెద్దగా నవ్వుతున్నారు.

రామారావుకు గుండె ఆగినంత పనయింది......

"ఈ నా చేతిలో ఉన్నదేమిటో తెలుసా......నా యావదాస్తి నీ పేర వ్రాసిన వీలునామా......" అంటూ పరపరా ఆ వీలునామాను ముక్కలు ముక్కలుగా చించివేశారు.

రామారావుకు ముచ్చెమటలు పోసినయి. ఉక్కిరిబిక్కిరయిపోయినాడు.

"తల్లీ, తండ్రీ పోయిన నిన్ను పెంచి పెద్దవాణ్ణి చేసినందుకు తగ్గ ప్రతిఫలం చూపించావు. పాముకు పాలుపోస్తే, కాటేసి చంపుతుంది......"

రామారావు తలదించుకొని, కాలి బొటనవేలుతో నేలను గీరుతున్నాడు.

"నీ సంగతి నాకు బాగా తెలుసు. నీవు ఈ ఘోర కృత్యానికి ఎందుకు ఒడిగట్టావో కూడా తెలుసు. నీవు ఎదురింటి విమలను ప్రేమించావుకదూ......? ఆ పిల్ల మన కులం కాకపోవటం వల్లను, మన అంతస్తుకు తగ్గదికాకపోవటం వల్లనూ, మీ పెళ్ళికి నేను అంగీకరించననీ నీకు బాగా తెలుసు. కనుక నా అడ్డం తీరితే నీవు దాన్ని పెళ్ళిచేసుకుని, నా కష్టార్జితమయినఈ ఆస్తితో కులుకుదామనుకున్నావు. నీ కుటిలస్వభావం కనిబెడ్దామనే నేనూ, ఆ డాక్టరూ కలసి ఈ నాటకం ఆడాము. నీవు ఒట్టి వాజమ్మవు...! ఆ నల్లపిల్లి సంగతి చెప్పగానే నమ్మేశావు.......అది శుద్ధ అబద్ధం......! ఏం భయపడకు........ నేను అప్పుడే చావను......!ఈ నా యావదాస్తి నా తదనంతరం తిరుపతి వెంకటేశ్వరస్వామికి రాస్తాను. నీకు ఈ ఇంట్లో ఒక్క చిల్లిగవ్వ కూడా దక్కనివ్వను........నీకు తెలివితేటలు చాలా తక్కువ అని నీకూ తెలుసు......నాకూ తెలుసు........నీవు తెలివిగలవాడివైతే, నా పీడ వదుల్చుకోవటానికి ఏ విషమో పెట్టి చంపిఉండేవాడివి.......నీకంత తెలివెక్కడిది......! ఊఁ......ఇక బయటకు నడు.......నీకూ నాకూ రాం......రాం......" అని గుక్కతిప్పుకోకుండా ఓ ఉపన్యాసం దంచి, పెద్ద పెద్ద అంగలు వేస్తూ, గది బయటకు నడిచాడు రాఘవయ్యగారు....

(ఈమధ్య ఒక ఇంగ్లీషు కథ చదివిన తర్వాత ఈ కథ వ్రాయ బుద్దేసింది) ★

---

# మనము-మన దేహస్థితి

21 వ పేజీ తరువాయి

పికి నీళ్ళుపోసి, నీరున్న ప్రదేశమును తట్టితే ఒక శబ్దమూ,నీరులేని ప్రదేశమును తట్టితే ఒక శబ్దమూ వస్తుంది. గాలి ఉన్న ప్రదేశమును తట్టితే డండం శబ్దం వస్తుంది. నీరు, ఘన పదార్థములను తట్టితే డబ్ డబ్ శబ్దం వస్తుంది. ఈ సూత్రాల ననుసరించే స్పందన విధానం ఏర్పడింది. ఉదరంలో ప్రేగులలో అంతో ఇంతో గాలి ఉంటుంది. అందువల్ల ఉదరమును స్పందించినప్పుడు 'డం డం' శబ్దము వస్తుంది. 'లివరు, స్ప్లీను పెద్దవైనప్పుడు దుర్మాంస వృద్ధులు ఏర్పడినప్పుడు ఆ ప్రదేశం స్పందించినప్పుడు డబ్ డబ్ శబ్దం వస్తుంది. ఉదరంలో నీరున్నప్పుడు, రోగి ఏ ప్రక్కకు తిరిగి పడుకుంటే ఆ వైపుకు నీరు చేరుతుంది. అంటే ఎడమవైపుకు తిరిగి పడుకుంటే ఎడమ డొక్కలోకి నీరు చేరుతుంది. ఆ ప్రదేశమును స్పందిస్తే డబ్ డబ్ శబ్దం వస్తుంది. కుడి డొక్కను స్పందిస్తే డం డం శబ్దం వస్తుంది. రోగిని కుడి ప్రక్కకు పడుకోబెడితే ఎడమ డొక్క డండం శబ్దం చేస్తుంది. ఉదర కుహరంలో నీరున్నదని గ్రహించ డానికి ఇది ఒక మార్గము.

స్పందన విధానము ఒక్క ఉదర వీక్షణలోనే కాదు; వక్ష పరీక్షలోనూ అది సహకరిస్తుంది. సాధారణంగా ఊపిరితిత్తులు గాలితో నిండి ఉంటవి. అందుచేత వాటిని స్పందించినప్పుడు డం డం శబ్దంవస్తుంది. కాని నెమ్మోనియా, క్షయవంటి వ్యాధులలో ఊపిరితిత్తి గడ్డకడుతుంది. అప్పుడు అది డబ్ డబ్ శబ్దం చేస్తుంది. కొన్ని పరిస్థితులలో ఊపిరితిత్తులమీది పొరలలో నీరు, చీము ఏర్పడుతవి. అప్పుడు స్పందనంలో డబ్ డబ్ శబ్దమే వస్తుంది. హృదయం రక్తంతో నిండిఉంటుంది. అందువల్ల హృదయ ప్రదేశం స్పందనంలో డబ్ డబ్ శబ్దం చేస్తుంది. ఆ శబ్దం వినబడే ప్రదేశమునుబట్టి దాని పరిమాణమును తెలుసుకోవచ్చును.

టైఫాయిడ్‌వంటి విషజ్వరములలో ప్రేగులు శక్తిహీనములై ఉబ్బిపోతవి. ఆ స్థితి చాలా ప్రమాదకరమైనది.

స్పర్శన విధానంలాగే స్పందన విధానము చాలా జాగ్రత్తగా మృదువుగా ఉపయోగించాలి. ★